క్లుప్తంగా

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకరిస్తా..

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకరిస్తానని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.5 లక్షలు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ దయాకర్‌ను ఆయన నివాసంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సహకరించాలని, సభ్యులందరి చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాలను ప్రభుత్వం నుంచి ఇప్పించేందుకు కృషి చేయాలని అధ్యక్షుడు నాగరాజు కోరారు. ఈ సందర్భంగా ఎంపీ దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర గొప్పదన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రటరీలు, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం

కేయూ క్యాంపస్: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఈక్రమంలో క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలని సుబేదారి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శుక్రూ సూచించారు. భారత రాష్ట్రసమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్‌వీ), కాకతీయ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ క్రికెట్ పోటీలు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నాల్గవ రోజు సోమవారం కొనసాగాయి. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని టాస్‌వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ బైరపాక ప్రశాంత్, కాకతీయ క్రికెట్ అకాడమీ చైర్మన్ ఫారూఖ్, నాయకులు వీరేందర్, రాకేష్, పరశురాములు, రాంబాబు, తిరుపతి, నరేంద్ర, రాజేష్, రోహిత్, స్నేహితు, ప్రవీణ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

హన్మకొండ: జిల్లా కోర్టులో పని చేస్తూ తొలగించబడిన పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు టి.ఉప్పలయ్య, మున్సిపల్ కార్మికుల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మరాజు మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా జిల్లా కోర్టులో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను అకారణంగా తొలగించిన గొడ్డిపాటి రామచందర్ రావు కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని సూచించారు. తొలగించిన 11 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీక్షలకు సీఐటీయూ నాయకులు యాస బాబు, బరుపట్ల మహేష్, టీఎమ్మార్పీఎస్ నాయకుడు మున్నంగి రఘు, తదితరులు సంఘీభావం తెలిపారు.

పట్టుదలతో ఏదైనా సాధ్యం

కాశిబుగ్గ: కఠోర శ్రమ, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఎడ్యుకేషన్ సైకాలజిస్ట్ డాక్టర్ బరుపాటి గోపి సూచించారు. కాశిబుగ్గలోని నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి)లో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాలు ఎలాంటివైనా సాధించాలనే తపన ఉండాలని చెప్పారు. ప్రణాళిక ప్రకారం చదివితే పరీక్షల్లో విజయం సాధించవచ్చని అన్నారు. అనంతరం గోపిని ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కుమారస్వామి, ఉపాధ్యాయులు అజయ్‌బాబు, శ్రవణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలపై బహిరంగ విచారణ

హన్మకొండ: విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలపై ఈనెల 22న ఈఆర్సీ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ జరుపనున్నట్లు టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని కలెక్టరేట్‌లో ఉదయం 10.30కు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ టి.శ్రీరంగరావు, సభ్యులు విచారణ చేపడతారని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ, సర్ చార్జీలు, విద్యుత్ కొనుగోళ్ల ట్రూ అప్ చార్జీలపై వినియోగదారుల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు బహిరంగ విచారణలో పాల్గొనాలని కోరారు.

స్పార్కిల్-23 పోస్టర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి: వచ్చే నెల 24నుంచి మూడు రోజుల పాటు ఎస్సార్ యూనివర్సిటీలో నిర్వహించే స్పార్కిల్ -23 వేడుకల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సార్ యూనివర్సిటీ వీసీ జీఆర్‌సీ.రెడ్డి మాట్లాడుతూ స్పార్కిల్ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు తమ అభిరుచులను ప్రదర్శించాలని సూచించారు. ప్రోగ్రాం కన్వీనర్ ఎ.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ఫెస్ట్ సందర్భంగా ట్రెడిషనల్ డే, డీజే నైట్‌తో పాటు పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఎస్సార్‌తోపాటు వివిధ యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు కూడా వేడుకల్లో పాలుపంచుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ గురురావు, డీన్ డాక్టర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్, డాక్టర్ అర్చనారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి

మామునూరు: కంటివెలుగు కార్యక్రమాన్ని స్పెషల్ పోలీసులందరు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కమాండెంట్లు డి.నరేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో వరంగల్ జిల్లా కంటి వెలుగు ప్రత్యేక పర్యవేక్షణ అధికారి డాక్టర్ గోపాల్‌రావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానిక, డాక్టర్ మోహన్‌సింగ్, డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ అరుణ విక్టర్ నేతృత్వంలో స్పెషల్ పోలీసులకు సోమవారం నేత్ర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఐదవ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పెద్ద బాబు, ఆర్‌ఐలు పురుషోత్తంరెడ్డి, ఏపీఎస్‌రెడ్డి, చంద్రన్న, నాగేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, అశోక్, ఆర్ఎస్సై నాగరాజు, స్పెషల్ పోలీస్ సంక్షేమ సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు సోమన్న, సిబ్బంది పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేయించుకుంటున్న నరేందర్‌రెడ్డి


అధికారితో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

వైద్య సిబ్బందిపై కార్పొరేటర్ అసహనం

హన్మకొండ చౌరస్తా: కంటి వెలుగు కేంద్రం నిర్వహణ సిబ్బందిపై 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు అసహనం వ్యక్తం చేశారు. హనుమకొండ రాయపురలోని ప్రభుత్వ యునాని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించేందుకు కార్పొరేటర్ రాగా, వైద్య పరీక్షలు చేసే ఏఆర్ మిషన్‌కు విద్యుత్ సౌకర్యం లేదని సిబ్బంది తెలిపారు. 8గంటలకు ప్రారంభం కావాలిన వైద్య సేవలు.. 11 గంటలు అవుతున్నప్పటికీ తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో కంటి వెలుగు నోడల్ ఆఫీసర్ షాలామసూద్, మెడికల్ ఆఫీసర్ గీత్‌పై అసహనం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని తప్పుపట్టారు. మధ్యాహ్నం తర్వాత విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో యునాని ఆస్పత్రి డాక్టర్ మహేంద్రకుమార్, 10వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

వరంగల్: అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులందరు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉండాలని ఇంటర్నేషనల్ 2వ వైస్ ప్రెసిడెంట్ బాల గంగాధర్ శాస్త్రి సూచించారు. వరంగల్ డిస్ట్రిక్ట్ (192), హనుమకొండ డిస్ట్రిక్ట్ (254) సంయుక్తంగా కాశిబుగ్గ తిలక్‌రోడ్డులోని కేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో 8వ డిస్ట్రిక్ట్ కన్వెన్షన్‌ను సోమవారం నిర్వహించారు. అనంతరం, వరంగల్ డిస్ట్రిక్ట్ 192 గవర్నర్‌గా అలయ్ చంద్రపలక శామ్యూల్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్లుగా చిప్ప వెంకటేశ్వర్లు, పెండెం మానస, హనుమకొండ డిస్ట్రిక్ట్ 254కు గవర్నర్‌గా అలయ్ భూపతి శంకర్, వైస్ స్టిక్ట్ గవర్నర్లుగా బండ సాయిరెడ్డి, సుంకిశాల సంతోష్‌రావు, గుజ్జారి శ్రీధర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న క్లబ్ సభ్యులు

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది


అన్నదానం చేస్తున్న పళని సేవాదళ్ సభ్యులు

రామన్నపేట: అన్ని దానాల్లో అన్నదానం చాలా గొప్పదని ప్రముఖ వేద పండితులు, పురోహితులు వెలిదె శ్రీదత్తశర్మ అన్నారు. అమావాస్యను పురస్కరించుకొని భద్రకాళి దేవాలయం ఆర్చ్ వద్ద పళని సేవాదళ్ సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతినెల అమావాస్య సందర్భంగా సేవాదళ్ సభ్యులు అన్నదానం చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పళని సేవాదళ్ బొడ్ల రవీంద్రనాథ్, అరుంధతి, పబ్బతి విశాల, సత్యనారాయణ, వేణు, వి.శ్రీనివాసులు, వి.అనిల్, అవినాష్, అరవింద్, కొండూరు నాగరాజు, లావణ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి


పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న అతిథులు

హసన్‌పర్తి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు సూచించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి మాదారపు వాణిశ్రీ సహకారంతో హసన్‌పర్తి జిల్లా పరిషత్ పదవ తరగతి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులను సోమవారం అందించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ సర్కార్ పాఠశాలల్లో త్వరలోనే డిజిటల్ విద్యావిధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. హసన్‌పర్తి వాసవి క్లబ్ అధ్యక్షుడు చిదురాల కరంచంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కుమార్, పద్మ, వాసవి క్లబ్ రీజియల్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, జోన్ కోఆర్డినేటర్ శంకర్, క్లబ్ కార్యదర్శి శ్యాంసుందర్, కోశాధికారి పురవర్ధన్, సభ్యులు పాల్గొన్నారు.

రాజీలేని పోరాటాలు చేసిన ‘కుమార్’

వరంగల్ చౌరస్తా: మతోన్మాద ఫాసిస్టు దోపిడీ వర్గాలపై తాండ్ర కుమార్ రాజీలేని పోరాటాలు చేశారని ఎంసీపీఐ(యూ) నగర కార్యదర్శి గడ్డం నాగార్జున కొనియాడారు. తాండ్ర కుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో కుమార్ చిత్రపటానికి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూలమాలలు వేసి సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ భూకబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ భూములను లాగి పేదప్రజలకు పంచిన ఘనత కుమార్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాస్ సావిత్రి, నగర కమిటీ సభ్యులు ఐతమ్ నగేష్, రాయినేని ఐలయ్య, నరసయ్య, యాకమ్మ పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

కేంద్రం నిధులతోనే నగరంలో అభివృద్ధి


మాట్లాడుతున్న ప్రదీప్‌రావు


వరంగల్: కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. 12వ డివిజన్ దేశాయిపేట బొడ్రాయిలో పార్టీ అధికార ప్రతినిధి తాబేటి వెంకట్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. దేశాయిపేట ప్రాంతంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో ఆకారపు మోహన్, కందిమల్ల మహేష్, పిట్టల కిరణ్, క్యాతం రాజు, బుజ్జికొండ శ్రీను, నైనేష్‌గౌడ్, సుధాకర్, తోట మహేందర్ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనపై ప్రజలు విసుగు చెందారు

హసన్‌పర్తి: కేసీఆర్ పాలనపై ప్రజలు విసుగు చెందారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి విమర్శించారు. 66వ డివిజన్ హసన్‌పర్తి గాంధీనగర్‌లో సోమవారం రాత్రి స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు.

నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేయాలి

కాజీపేట రూరల్: నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోన్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ సూచించారు. మజ్దూర్ యూనియన్ డీజిల్ బ్రాంచీ అధ్యక్షుడు పాక వేదప్రకాష్ ఆధ్వర్యంలో కాజీపేట డీజిల్‌షెడ్ ఎదుట సోమవారం కార్మికుల గేట్‌మీటింగ్, సంతకాలు సేకరించి రాష్ట్రపతికి టెలిగ్రామ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు భిక్షపతి, జానిమియా, మహేందర్, యాదగిరి, రమేష్, రాజేశ్వర్‌రావు, శంకర్, ప్రదీప్, రవికిరణ్, శివప్రసాద్, నరేష్, దినేష్, కృష్ణ, దేవేందర్, భీష్మదేవ్, చేరాలు, భాస్కర్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్

క్రైం కార్నర్

పొలంలో కుళ్లిన మృతదేహం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్ల శివారులోని ఓ వ్యవసాయ పొలంలో కుళ్లిన మృతదేహం లభ్యమైంది. తన పొలంలో మృతదేహం ఉందని ముచ్చర్లకు చెందిన ఓరుగంటి గణపతిరెడ్డి అనే రైతు పోలీసులకు సమాచారం అందించాడు. ఈమేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలం వల్లంకుంట గ్రామానికి చెందిన శేఖర్‌గా ధ్రువీకరించారు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మడికొండ శివారు ఔటర్ రింగ్ రోడ్డు వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన బొడ్డు అలగ్జాండర్.. తన కుమారుడు అఖిల్‌తో కలిసి బైక్‌పై మడికొండ నుంచి ధర్మసాగర్ వైపు వెళ్తుండగా ఔటర్ రింగ్ రోడ్డు బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వాహనం వారిని ఢీ కొట్టింది. దాంతో అఖిల్‌కు చేయి విరగగా, తీవ్ర గాయాలైన అలగ్జాండర్‌ను 108వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదని తెలిసింది.

బంగారు చైన్ అపహరణకు యత్నం

ఖిలా వరంగల్: వృద్ధురాలి మెడలోని 2తులాల బంగారు గొలుసును లాక్కేందుకు ఓ ఆగంతకుడు యత్నించగా, ఆ వృద్ధురాలు అడ్డుకుని బిగ్గరగా అరవడంతో దొంగ గొలుసును వదిలేసి పారిపోయాడు. ఈ ఘటన వరంగల్ ఉర్సుకురుమ వాడలో సోమవారం సాయంత్రం జరిగింది. బూర ప్రేమలీల.. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో మంచినీళ్లు కావాలని ఓ వ్యక్తి అడిగి బంగారు గొలుసును అపహరించేందుకు యత్నించాడు.

సంక్షిప్తంగా

కేయూలో ఇద్దరికి డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎకనామిక్స్ విభాగం ఇద్దరు పరిశోధకులు చిలుసాని రాజు, ఈదునూరి వెంకటేశ్వర్లకు యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఇంపాక్ట్ ఆఫ్ గ్లోబలైజేషన్ ఆన్ హ్యాండ్లూమ్ ఇండస్ట్రీ – ఏ స్టడీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి చిలుసాని రాజుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. అలాగే, ఎమెర్జింగ్ ట్రెండ్స్ ఇన్ కన్సమ్షన్ ప్యాటర్న్స్ – ఏ స్టడీ ఇన్ రూరల్ ఏరియాస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఈదునూరు వెంకటేశ్వర్లకు డాక్టరేట్ ప్రదానం చేశారు. వారిద్దరికి ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పాపిరెడ్డి పర్యవేక్షణలో డాక్టరేట్ పూర్తిచేశారు.

ఆటో డ్రైవర్లలందరికీ లైసెన్స్‌లు

హసన్‌పర్తి: లైసెన్స్‌లు లేని ఆటోడ్రైవర్లందరికీ లైసెన్స్‌లు జారీ చేస్తామని డీటీసీ పురుషోత్తం తెలిపారు. ఆదర్శ ఆటో డ్రైవర్ యూనియన్ ప్రతినిధులు డీటీసీ పురుషోత్తంను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ లైసెన్స్‌లు లేని వారి జాబితాను తయారు చేసి అందించాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కస్తూరి రవి, ఉపాధ్యక్షుడు పోలెపల్లి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి పోలెపల్లి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

అమరులతోనే రాష్ట్రం సాకారం

దేశాయిపేట: పద్మశాలి ముద్దుబిడ్డ, తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య లాంటి అమరుల త్యాగంతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని జిల్లా పద్మశాలి అధ్యక్షుడు ఆడెపు రవీందర్ అన్నారు. యాదయ్య 13వ వర్ధంతి కార్యక్రమాన్ని అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గోపాలస్వామి గుడి సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఝెలుగం లీలావతి, సత్యనారాయణ, వడ్నాల నరేందర్, నగేష్ నేత, సదానందం, రాజయ్య, ఓం ప్రకాష్, నాగరాజు, సదానందం, రమాదేవి, రమేష్ పాల్గొన్నారు.

బీసీలు శాసించే స్థాయికి ఎదగాలి

ఖిలా వరంగల్: కేంద్ర, రాష్ట్ర పాలకుల వివక్షకు గురైన బీసీలందరూ సంఘటితమై ఉద్యమించాలని, బీసీలు చైతన్యవంతులై యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో రమేష్ అధ్యక్షతన బీసీ హక్కుల సాధన సమితి సమావేశం సోమవారం జరిగింది. కార్యక్రమంలో వెంకన్న, గోవర్ధనచారి, కుమార్, చందు, సాంబయ్య, ఆరెల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

కొండచిలువల సంచారం

హసన్‌పర్తి: పెద్దచెరువు కట్టపై కొండచిలువల సంచారం అధికమైంది. సోమవారం తెల్లవారు జామున కొండచిలువలు సంచరిస్తున్నట్లు వాకర్స్ తెలిపారు. రెండు నెలలుగా కట్టపై కొండచిలువలు కనిపిస్తున్నాయని చెప్పారు.

సఖి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

హన్మకొండ: సఖి కేంద్రం అందిస్తున్న సేవలను బాధిత మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం కేస్ వర్కర్లు వి.విసీల, హరిత సూచించారు. హనుమకొండ నక్కలగుట్టలోని మెప్మా కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా న్యాయ, పోలీసు, వైద్య సహాయం, తాత్కాలిక వసతి, మహిళలకు ఉచిత కౌన్సెలింగ్ అందించనున్నట్లు వివరించారు. బాధితులు సఖి కేంద్ర సేవలకు 0870–2452112, టోల్ ఫ్రీ నంబర్ 181కు కాల్ చేయాలని కోరారు.

త్వరలో నెరవేరనున్న కల

మడికొండ: త్వరలో ప్లాట్ల యజమానుల కల నేరవేరనున్నదని మడికొండ శివారులోని భాస్కర్‌నగర్ గృహనిర్మాణ సహకార సంఘం కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆర్‌డీఓ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో డైరెక్టర్లు పుష్ప, రమేష్‌కుమార్, సారయ్య, ఇంద్రారెడ్డి, కుమారస్వామి, రాజేందర్, గోవింద్ నాయక్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

25 వరకు కార్నర్ మీటింగ్‌లు పూర్తి చేయాలి

కాశోజీ సెంటర్: జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో కార్నర్ మీటింగ్‌లు ఈనెల 25వ తేదీ వరకు పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి నియోజకవర్గ కన్వీనర్లను ఆదేశించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్లతో కార్నర్ మీటింగ్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మానసిక సమస్యలతోనే వ్యాధులు

గీసుకొండ: మానసిక సమస్యల వల్లే అసంక్రమిత వ్యాధులైన షుగర్, బీపీ, క్యాన్సర్, బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్, పక్షవాతం లాంటివి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మానసిక వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్‌రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ పద్మశ్రీ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట జీపీ కార్మికుల ధర్నా

వరంగల్ రూరల్: అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోపికి వినతిపత్రం సమర్పించారు. గ్రామపంచాయతీల్లోని పలు విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఓ నం.60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ.15,600, కారోబార్, బిల్ కలెక్టర్‌కు రూ.19,500 చొప్పున వేతనాలు చెల్లించాలని వినతిలో పేర్కొన్నారు.

పశువైద్య శిబిరం ప్రారంభం

ఖిలా వరంగల్: తూర్పు కోట కొత్తగడ్డలోని పశువైద్యశాల ప్రాంగణంలో పశువైద్య శాఖ, పశు సంవర్ధక శాఖ డాక్టర్ మాళవిక ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ హాజరై పశువైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, డాక్టర్ భగీరథ, విజయ్, హరేందర్, పవన్ తదితరులుపాల్గొన్నారు.

కేదారేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మడికొండ: 64వ డివిజన్‌లోని మడికొండ పెద్దచెరువు కట్ట వద్ద ఉన్న కేదారేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు మంత్రవాది వెంకటప్రసాద్ మంత్రోచ్చరణల మధ్య సోమవారం ఉదయం పంచామృతాభిషేకం, సంచవర్ణ అభిషేకవం జరిపించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో దువ్వ శ్రీకాంత్ – సరిత దంపతులు, పైడిపాల రఘుచందర్ – కవిత దంపతులు, దువ్వ కృష్ణ – మమత దంపతులు, దువ్వ సందీప్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

బండా ప్రకాశ్‌కు సన్మానం

హన్మకొండ: శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ను బీసీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరాటేలో ‘కివీ’ విద్యార్థుల ప్రతిభ

కరీమాబాద్: మంచిర్యాల జిల్లా మందమర్రిలో నిర్వహించిన కరాటే పోటీల్లో కరీమాబాద్ కివీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జపాన్ షోటోకాన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో 6 రాష్ట్రాలకు చెందిన 600 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనగా కివీ పాఠశాలకు చెందిన విద్యార్థులు నిఖిలేశ్వర్, వరుణ్‌లు బంగారు పతకాలు సాధించగా, విష్ణు, సాయిచరణ్ వెండి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ దాసి సతీష్‌మూర్తి తెలిపారు.

ఒయాసిస్ అనాథాశ్రమంలో అన్నదానం

హన్మకొండ: సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి, సురేఖ 43వ వివాహ వార్షికోత్సవం, అంతర్జాతీయ చిరంజీవి ఫెడరేషన్ ఏడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ వడ్డెపల్లిలోని ఒయాసిస్ అనాథాశ్రమంలో అంతర్జాతీయ చిరంజీవి ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు.

వరంగల్ రైల్వే స్టేషన్‌లో..

కాశిబుగ్గ: అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని అన్నపూర్ణ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అన్నారు. వరంగల్ రైల్వే స్టేషన్‌లో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బల్దియా ఉద్యోగులు, సీకేఎం కళాశాల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి ‘అన్నపూర్ణ సేవాదళ్’ అనే స్వచ్ఛంద సంస్థ నెలకొల్పి సర్వ్ టు నీడ్ అనే నినాదంలో నెలలో ఒకరోజు అన్నదానం చేపడుతున్నట్లు వారు తెలిపారు.

పార్టీ మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల సమస్యలను పొందుపరుస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా రేవంత్‌రెడ్డి పాదయాత్ర సోమవారం సాయంత్రం వరంగల్ ప్రెస్‌క్లబ్ ముందు నుంచి వెళ్తుండగా గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ కోరిక మేరకు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లోకి రేవంత్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు సన్మానించారు. అనంతరం, రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో వరంగల్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే ఇప్పటికీ వాటిని వారికి అప్పగించిన దాఖలాలు లేవని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో నిలబడి ప్రజలను జాగృతం చేసిన జర్నలిస్టులకు.. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక ప్రభుత్వం అండగా నిలబడలేదని తప్పుపట్టారు. రేవంత్‌రెడ్డి వెంట ములుగు ఎమ్మెల్యే సీతక్క, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్, పార్టీ సీనియర్ నేత మల్లు రవి, తదితరులు ఉన్నారు.


రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

నైపుణ్యాల వృద్ధికి శిక్షణ దోహదం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి

హన్మకొండ: నైపుణ్యాల వృద్ధికి శిక్షణ దోహదపడుతుందని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నాంది మహేంద్ర ప్రైడ్ సహకారంతో విద్యార్థినులకు ఉద్యోగ నైపుణ్య శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ శిక్షణ కాలంలో విద్యార్థులకు కంప్యూటర్, ఆంగ్లభాష నైపుణ్యాలు, ఆలోచనలను సృజనాత్మకంగా మలుచుకునే తీరు, బృంద చర్చలో పాల్గొనే విధానం, న్యూమరికల్ ఎబిలిటీ, ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై శిక్షణ ఇస్తారని వివరించారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న మోదీ

మామునూరు: కార్మిక హక్కుల చట్టాలను ఒక్కొక్కటిగా కేంద్రంలోని మోదీ సర్కార్ కాలరాస్తోందని మానవ హక్కుల వేదిక నాయకులు బండి కోటేశ్వర్‌రావు, బ్రిక్స్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ విమర్శించారు. వరంగల్ నక్కలపెల్లిలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగుల దయాకర్, నున్న అప్పారావు అధ్యక్షతన బ్రిక్స్ అండ్ ట్రాక్టర్ వర్కర్స్ యూనియన్ మహాసభ సోమవారం జరిగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగుల దయాకర్, బాలరాజు, బన్న నర్సింగం, రాజేందర్, ఎర్ర జయబాబు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆరెల్లి కృష్ణ

నిరుపేద వైద్య విద్యార్థికి ఆర్థికసాయం

కాశిబుగ్గ: నగరంలోని 19వ డివిజన్ కాశిబుగ్గ వివేకానందకాలనీకి చెందిన నిరుపేద దంత వైద్య విద్యార్థిని గోవిందుల పూజితకు వరంగల్ తూర్పు బీజేపీ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆర్థిక సాయం అందజేశారు. ఈమేరకు రూ.10 వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందజేసి, వైద్యవిద్య పూర్తయ్యే వరకు చేయూతనిస్తామని భరోసా ఇచ్చారు. కాగా, పూజిత తండ్రి భిక్షపతి సైకిల్‌పై తిరుగుతూ బెడ్ షీట్లు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి ఉమాదేవి కిరాణ షాపులో గుమస్తాగా పని చేస్తోంది. దాతలు స్పందించి చేయూతనందించాలని పూజిత తల్లిదండ్రులు కోరుతున్నారు.

